సాక్షి ప్రకాశం

సోమవారం ၊ 11 ၊ డిసెంబర్ ၊ 2023



పోస్టల్ ఉద్యోగుల సేవలు అభినందనీయం

పోస్టల్ ఉద్యోగుల సేవలు అభినందనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ అన్నారు.

- 8లో..



ఖైదీలకు కూడా హక్కులుంటాయి

శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు, రిమాండ్‌లో ఉన్న వారికి కూడా హక్కులుంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30.9/23.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు ఒంగోలు ఎంపీ రాక

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈనెల 11, 12 తేదీల్లో నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని మాగుంట కార్యాలయ మేనేజర్ భవనం సుబ్బారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు తన కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. 6 గంటలకు స్థానికంగా జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 12వ తేదీ ఉదయం 8 గంటలకు తన కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. 9 గంటలకు మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు బాలినేని నివాసానికి చేరుకుంటారు. 11 గంటలకు స్థానిక తన కార్యాలయంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అందుబాటులో ఉంటారు.

వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించిన సాహిత్యం



బాలకృష్ణారెడ్డి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

ఒంగోలు టౌన్: న్యాయమూర్తిగా ఆదర్శనీయమైన జీవితాన్ని గడిపిన బాలకృష్ణారెడ్డి తనదైన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తూ చేసిన రచనలు ప్రతి ఒక్కరిలో ఆలోచనలు రేకెత్తిస్తుంటాయని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డా.నాగభైరవ ఆదినారాయణ అన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా కాకతీయ సేవా సమాఖ్య కార్యాలయంలో విశ్రాంత న్యాయమూర్తి బాలకృష్ణారెడ్డి రచించిన 'అక్షర ప్రస్థానం', 'నా జీవితమే కవిత్వం' పుస్తకాలను డా.చుంచు చలమయ్య ఆవిష్కరించారు. నాగభైరవ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రంథావిష్కరణలో ఆదినారాయణ ప్రసంగిస్తూ సొంత శైలితో రచనలు చేసిన బాలకృష్ణారెడ్డి తెలుగు సాహిత్యంలో నిలిచిపోయేలా మరిన్ని రచనలు చేయాలని ఆకాంక్షించారు. సమాజాన్ని జీవనదిలా నిత్య చైతన్యం కలిగించే సాహిత్యం రావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సాహితీవేత్తలు శ్రీరామకవచం రామసాగర్, కేఎస్వీ ప్రసాద్, బీసీడి కృష్ణయ్య, కుర్రా ప్రసాద గురవారెడ్డి, జ్వాలా ఉమామహేశ్వర శర్మ, యువీ రత్నం, ఉన్నం జ్యోతివాసు తదితరులు బాలకృష్ణారెడ్డి సాహిత్యాన్ని విశ్లేషించారు. సమావేశంలో బాదరయ్య, కంచర్ల సుబ్బారావు, సంజీవరెడ్డి, ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు, బెజవాడ రామారావు పాల్గొన్నారు. రచయిత బాలకృష్ణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

మిచాంగ్ తుఫాన్.. కొందరు రైతులకు నిరాశ మిగిల్చితే.. పశ్చిమ ప్రాంత రైతులకు వరంగా మారింది. ఈ వర్షానికి ముందు నైరుతి ముఖం చాటేసింది... ఈశాన్యం జాడ లేకుండాపోయింది. జూన్ నుంచి నవంబర్ నెలాఖరు వరకు ప్రతి నెలా లోటు వర్షపాతమే. కానీ తుఫాన్ కారణంగా లోటు కొంత తీరేలా వర్షం కురిసింది. దీంతో పంట సాగుపై రైతులు దృష్టి సారించారు.



తాళ్లూరులో ప్రవహిస్తున్న దోర్నపు వాగు

జూన్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు నమోదు కావాల్సిన వర్షపాతం: **27,437.8** మి.మీ

నమోదైన వర్షపాతం: **19,483.8** మి.మీ

వానలోటు తీరేలా..

- మిగులు వర్షంతో ఊపందుకున్న వ్యవసాయం
- జిల్లాలో పెరిగిన భూగర్భ జలాలు
- రబీ సాగులో నిమగ్నమైన రైతులు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో డిసెంబర్ నెలలో కురిసిన మిగులు వర్షంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. తుఫాన్ కారణంగా వర్షం, గాలులతో తూర్పు ప్రకాశం ప్రాంతంలో కొంత నష్టం చేకూరింది. పశ్చిమ ప్రకాశంలో పది శాతం నష్టం కలిగించినా..ఖరీఫ్, రబీలో వేసిన పంటలకు జీవం పోయటంతో పాటు భూగర్భ జలాలు మళ్లీ పుంజుకోవటానికి ఉపయోగపడ్డాయి. జిల్లాలో జూన్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు నమోదు కావాల్సిన వర్షపాతం 27,437.8 మి.మీ కాగా.. 19,483.8 మి.మీ మాత్రమే నమోదైంది. డిసెంబర్‌లో సాధారణ వర్షపాతం 1651 మి.మీలు కాగా ఈనెలలోనే 3879.5 మి.మీగా నమోదైంది. ఈ వర్షానికి ముందు నైరుతి ముఖం చాటేసింది... ఈశాన్యం జాడ లేకుండాపోయింది. జూన్ నుంచి నవంబర్ నెలాఖరు వరకు ప్రతి నెలా లోటు వర్షపాతమే. కానీ తుఫాన్ కారణంగా లోటు కొంత తీరేలా వర్షం కురిసింది. అవసరమైనప్పుడు ముఖం చాటేసిన వర్షం.. ఒక్కసారిగా తుఫాన్ రూపంలో రావటంతో రైతులు విలవిల్లాడారు. 38 మండలాల్లో కేవలం తాళ్లూరు, ఎన్‌జీపాడు రెండు మండలాల్లో మాత్రమే డిసెంబర్ నాటికి లోటు వర్షపాతం పోయి మిగులు వర్షపాతంగా నమోదయ్యాయి. రబీలో అధికంగా శనగ, పొగాకు సాగవుతాయి. తుఫాన్‌కు ముందు రబీలో శనగ సాధారణ సాగు 1,38,292 ఎకరాలు ఉండగా, కేవలం 24,115 ఎకరాలు మాత్రమే సాగైంది. మినుము 62,887 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా, 29,820 మాత్రమే సాగైంది. అదేవిధంగా పొగాకు 68,587 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా 36,972 ఎకరాలు సాగైంది. డిసెంబర్‌లో కురిసిన వర్షాలతో ఆయా పంటల సాగుతో పాటు, చిరుధాన్యాలు అధికంగా సాగు చేస్తున్నారు. ఉద్యానవన పంటలు సైతం ఊపిరి పీల్చుకున్నాయి. అదే విధంగా సస్యరక్షణ, పొగాకు రైతులు మొక్కలు దెబ్బతిన్న స్థానంలో మళ్లీ నాటుకుంటూ రైతులు బిజీగా ఉన్నారు. జిల్లాలో 38 మండలాల్లో నమోదైన వర్షపాతం, లోటు వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.



జీవం పోసుకున్న గొట్లగట్టులో సాగు చేసిన బొబ్బర్లు

వర్షపాతం వివరాలు (మి.మీలలో)

మండలం	డిసెంబర్ నెల సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం	జూన్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు		
			సాధారణ	నమోదైన వర్షపాతం	లోటు% (శాతం)
యర్రగొండపాలెం	22.3	61.1	625	487.6	-22
పుల్లలచెరువు	12.9	79.2	601.1	489.2	-18.6
త్రిపురాంతకం	22.3	104.6	639.1	567.8	-11.2
దోర్నాల	34.2	73.4	748.8	460.4	-38.5
పెద్దారవీడు	29.2	48.8	612.4	381.9	-37.6
దొనకొండ	24.9	84.8	630.1	347.9	-44.8
కురిచేడు	37.8	88.8	647.6	423.4	-34.6
ముండ్లమూరు	35.3	163.0	690.5	664.2	-3.8
దర్శి	39.4	184.4	688.1	683.1	-0.7
మార్కాపురం	29.2	66.6	621.6	385.5	-38.0
అర్ధవీడు	17.3	40.8	675.2	258.2	-61.7
కంభం	20.3	38.4	634.3	382.2	-39.7
తర్లుపాడు	24.7	59.2	639.6	365.5	-42.9
కొనకనమిట్ల	37.5	123.0	640.3	260.0	-59.4
పొదిలి	42.2	134.0	661.7	523.8	-20.8
తాళ్లూరు	34.5	174.0	719	895.4	-24.5
ఎన్‌జీపాడు	49.1	130.4	844.1	933.0	-10.5
మద్దిపాడు	43.6	121.4	822.9	808.2	-1.8
చీమకుర్తి	62.8	110.4	770.7	616.6	-20
మర్రిపూడి	50.2	121.4	664.4	490.3	-26.2
హెచ్‌ఎంపాడు	34.9	73.2	649.7	441.3	-32.1
బీవీపేట	29.0	43.2	654.5	305.8	-53.3
రాచర్ల	16.3	43.0	546.7	458.5	-16.1
గిద్దలూరు	16.5	45.4	572.3	470.1	-17.9
కొమరోలు	20.5	53.0	657	466.1	-29.1
వెలిగండ్ల	36.9	96.6	695.7	411.8	-40.8
కనిగిరి	36.2	96.0	694.3	418.1	-39.8
కొండపి	86.5	159.2	913.3	665.7	-27.1
ఎస్‌ఎన్‌పాడు	70.2	126.2	839.8	612.4	-27.1
ఒంగోలు	77.9	124	913.9	546.2	-40.2
కొత్తపట్నం	84.8	172.6	943.6	756.5	-19.8
టంగుటూరు	96.2	139.4	935.9	629.9	-32.7
జరుగుమల్లి	91.0	166.0	933.3	527.9	-43.4
పొన్నలూరు	75.1	128.4	831.7	615.5	-26.0
పీసీపల్లి	38.9	81.2	702.3	472.7	-32.7
సీఎస్‌పురం	33.6	78.4	682.2	371.1	-45.6
పామూరు	36.3	84.8	647	294.5	-54.5
ఎస్ కొండ	100.6	161.2	1048.1	595.2	-43.2
మొత్తం	1651.1	3879.5	27437.8	19483.8	-29
సరాసరి	43.5	102.3	722.0	512.7	-29

మిగులు వర్షంతో భూగర్భ జలాలు పెరిగే అవకాశం



తుఫాన్ ప్రభావంతో తూర్పు ప్రకాశంలో కొంత మేర దెబ్బతింది. మొత్తం జిల్లాలో 10 శాతం నష్టం జరిగి ఉంటుంది. అదేవిధంగా పశ్చిమ ప్రాంతంలో వర్షాలతో కుంటలు, చెరువుల్లో నీరు నిలిచి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. ఈనెలలో కురిసిన వర్షాలతో పైర్లకు కొంత మేర మేలు చేసి, మిగిలిన రబీ పంటల సాగుకు కూడా దోహదం చేసింది. సస్యరక్షణ చర్యలపై రైతులు దృష్టి సారించాలి.

– ఎస్ శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి, ఒంగోలు

ఉద్యానవన పంటలకు మేలు



తుఫాన్ కారణంగా ఉద్యానవన పంటలు అరటి, మిరప కొంత మేర దెబ్బతింది. వర్షం పోయిన తర్వాత సస్యరక్షణ చర్యలు చేపడితే కొంత నష్టనివారణ జరుగుతుంది. మిగులు వర్షంతో ఉద్యానవన పంటలకు ఎంతో మేలు చేకూరుతుంది. ముఖ్యంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఉన్న పశ్చిమ ప్రకాశానికి వర్షంతో ఊరటనిచ్చినట్టైంది.

– వై గోపీచంద్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి, ఒంగోలు



ముండ్లమూరు మండలంలో ప్రవహించిన చిలకలేరు



కొనకనమిట్ల మండలంలో సాగు చేసిన వేరుశనగ పంట



గొట్లగట్టు చెరువుకు వచ్చిన నీరు

సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి, ఎమ్మెల్యే కేపీ
- గజ్జలకొండలో రెండు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ప్రారంభం



గజ్జలకొండలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పక్కన ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం రూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన అందుతోందని.. సచివాలయ వ్యవస్థ సీఎం జగన్ కలల ప్రాజెక్టు అని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. మండలంలోని గజ్జలకొండ గ్రామ పంచాయతీలో నూతనంగా రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయం-1, 2 భవనాలు, రూ.43.60 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాలు ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల సేవలు, సంక్షేమ సేవలను ఒకేచోట అందుబాటులో ఉంచడం ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. దేశంలో మరెక్కడా ఇలాంటి సేవలు లేవని జెడ్పీచైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, ఎంపీపీలు పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి, తర్లుపాడు ఎంపీపీ భూలక్ష్మీ రామసుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, కుందురు మల్లారెడ్డి, కవలకుంట్ల పేతురు, మాజీ ఎంపీటీసీ గాయం నాగేందర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ నాయుడుపల్లి శ్రీనివాస రెడ్డి, కొలగట్ల శివారెడ్డి, ఎల్ శేఖర్, పంచాయతీరాజ్ డీఈ కే ఆదినారాయణ, ఎంపీడీవో తోట చందన, పంచాయతీరాజ్ ఏఈ మోహన్‌రాజ్, ఏఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రతాపరెడ్డి, ఏపీఎం రమేష్‌బాబు, పశువైద్యాధికారి భాస్కర్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, గ్రామ పార్టీ నాయకులు ఓబులరెడ్డి, అచ్చిరెడ్డి, గాలిరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా శాఖను బలోపేతం చేయాలి

- వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి

ఒంగోలు: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మాంటిస్సోరి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నూతన సంవత్సరానికి సంబంధించి అసోసియేషన్ జిల్లా డైరీ, క్యాలెండర్లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అదే విధంగా అసోసియేషన్ సభ్యత్వ నమోదుకు సంబంధించి మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ బలోపేతం అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి సభ్యత్వాన్ని పెంచాలన్నారు. జిల్లా అధ్యక్షుడు మట్టిగుంట మహేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులకు ఆన్‌డ్యూటీపై బీఈడీ, బీపీఈడీ చేసుకునేందుకు అవకాశం ఉన్నందున దరఖాస్తు చేసుకున్న వారందరికీ అవకాశం కల్పించేలా సర్టిఫికెట్లు మంజూరు చేయించాల్సిన అవసరాన్ని చర్చించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రాష్ట్ర కార్యదర్శి బీసాబత్తిన శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతం రమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు అన్నింటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా ఆర్థిక శాఖ కార్యదర్శి వై.కృష్ణప్రసాద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్.రవిశేఖరరెడ్డి, ఎస్కె ఉస్మాన్ సాహెబ్, వైసీ యోగిరెడ్డి, నర్సయ్య, కె.కొండలరాయుడు, పి.శేషిరెడ్డి, తిమోతి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ సెకండ్ లెవల్ పోటీలు

SAKSHI SPELL Bee 2023-24

స్పెల్‌బీ

SAKSHI MATH BEE 2023-24

మాథ్స్‌బీ



స్పెల్‌బీ టెస్టుకు హాజరైన విద్యార్థులు

ఒంగోలు: 'సాక్షి' స్పెల్‌బీ సెకండ్ లెవల్ పోటీలు ఆదివారం స్థానిక క్విస్ ఉన్నత పాఠశాలలో ఉత్సాహంగా జరిగాయి. ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లు వ్యవహరిస్తున్న ఈ పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. పోటీలను క్విస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ఏవో స్వాతి, 'సాక్షి' అడ్వర్టయిజ్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శర్మ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 'సాక్షి' అడ్వర్టయిజ్‌మెంట్ అసిస్టెంట్ మేనేజర్ శర్మ మాట్లాడుతూ ఇటీవల ప్రిలిమినరీ పోటీలు ముగిశాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న క్వార్టర్ ఫైనల్స్‌లో విజేతలైన వారికి సెమీ ఫైనల్ పోటీలు విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్, విజయవాడలలో జరుగుతాయని చెప్పారు. సెమీఫైనల్ విజేతలకు హైదరాబాద్‌లో ఫైనల్ పోటీలు నిర్వహిస్తారన్నారు. స్పెల్‌బీ ఆవశ్యకతను గుర్తించిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహిస్తున్న తీరు సంతోషంగా ఉందని చెప్పారు.

ఆంగ్లభాషపై పట్టు పెంచుకునేందుకు ఉపయోగంగా ఉంది



ఆంగ్లభాషపై పట్టు పెంచుకునేందుకు 'సాక్షి' స్పెల్‌బీ ఎంతగానో ఉపయోగపడింది. నూతన పదాలను తెలుసుకోవడంతోపాటు వాటి ఉచ్ఛారణపై పట్టు సాధించడం, స్పెల్లింగ్‌ను అర్థం చేసుకోవడం వల్ల ఆంగ్ల ఉచ్ఛారణపై అవగాహన పెరిగింది. నిజంగా ఆంగ్లం పట్ల పిల్లల్లో ఉండే భయాన్ని పోగొట్టేందుకు ఈ 'సాక్షి' స్పెల్‌బీ కార్యక్రమం చాలా ఉపయోగపడుతుంది.

– బి.సాయి విదీష

ఆంగ్లంపై పట్టు పెంచుకునేందుకు దోహదపడింది



'సాక్షి' స్పెల్‌బీ కార్యక్రమం ద్వారా ఆంగ్లంలో మాకు తెలియని అనేక పదాలను తెలుసుకోగలిగాను. వారు మెటీరియల్ కూడా ఇవ్వడంతో ఆ పదాలను నా అంతట నేను ఒంటరిగా ఉన్నప్పుడు చదువుకుంటూ డిక్షనరీని ఉపయోగించుకుని అర్థాలను తెలుసుకోగలిగాను. ఇది తప్పకుండా నాకు జీవితంలో ఎంతగానో తోడ్పడుతుంది.

– పి.భార్గవ్

స్పెల్‌బీ ఎంతో ఉపయోగకరం



'సాక్షి' స్పెల్‌బీ పోటీలు మాకు ఎంతో ఉపయోగకరం. ఆంగ్లంలోని అనేక పదాల స్పెల్లింగ్స్‌ను తెలుసుకుంటూ వాటితోపాటు వాటి అర్థాలను కూడా తెలుసుకోవడం వల్ల ఆంగ్లంలో మాట్లాడడం సులువుగా ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న 'సాక్షి' యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– ఎస్.రీష్మసాయి భ్రమర

ఇందులో పాల్గొనడం ఒక మంచి అవకాశం



'సాక్షి' స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనగలగడం నాకు దక్కిన ఒక మంచి అవకాశం. గ్రామర్‌పై పట్టు పెంచుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. ఈ పోటీలు విద్యార్థులకు వారు జీవితంలో ఉన్నతంగా రాణించేందుకు ఎంతగానో తోడ్పడతాయి. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

– ఆర్.సమీర



జగనన్న సురక్షలో రేషన్ కార్డు



అనంతవరం గ్రామంలో 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నాను. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా సాంకేతిక లోపం వలన రేషన్ కార్డు లేక ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్నాం. ఇప్పుడు సీఎం జగనన్న దయ వలన జగనన్న సురక్ష కార్యక్రమంలో సమస్యలు సత్వరమే పరిష్కారం చేస్తారని విని నమ్మలేదు. కానీ రేషన్‌కార్డు దరఖాస్తు చేసుకోగా వలంటీరు వచ్చి అవసరమైన సర్టిఫికెట్లు తీసుకొని ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రేషన్‌కార్డు అందించారు. ఇక పై నాకు కూడా రేషన్ సరుకులతో పాటు ప్రభుత్వ పథకాలు అందుతాయి. సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– ఉప్పలపాటి వెంకట సుబ్బయ్య, అనంతవరం, టంగుటూరు మండలం

పింఛన్ రావడం చాలా ఆనందంగా ఉంది



గతం ప్రభుత్వ హయాంలో పింఛన్ దరఖాస్తు చేసుకున్నా కూడా రాలేదు. కానీ ఇప్పుడు వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుంటే వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. అంతేగాకుండా దశల వారీగా పింఛన్ పెంచి ఇంటికే తెచ్చి ఇవ్వడం ఆనందంగా ఉంది.

– తిరుపతయ్య, రైతు, మార్కెళ్ల

నష్టపరిహారం అందింది



నాకున్న 5 ఎకరాల్లో కంది పంట వేసి గతంలో నష్టపోయాను. సకాలంలో వర్షాలు పడకపోవడంతో పంట చేతికి రాలేదు. దీంతో ఈ-క్రాప్ చేయించుకోవడంతో ఎకరాకు రూ.15 వేల చొప్పున 5 ఎకరాలకు రూ.75 వేలు నష్టపరిహారం ఇన్స్యూరెన్స్ పడింది. మళ్లీ ధైర్యంగా పంట వేసేందుకు సిద్ధంగా ఉన్నాను.

– పుల్లారెడ్డి, రైతు, బట్టుపల్లి

నాకు ఆయువు పోశారు



నాకు క్యాన్సర్ వచ్చింది. డబ్బులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాను. వైద్యశాలకు వెళ్తే ఖర్చులు చాలా అవుతాయి. వైద్య ఖర్చులకు ప్రభుత్వం డబ్బులు ఇస్తుందని తెలిసి దరఖాస్తు చేసుకున్నాను. నాకు ప్రభుత్వం వైద్య ఖర్చుల కోసం రూ.4.50 లక్షలు మంజూరు చేసింది. దీంతో వైద్యశాలలో కీమో థెరపీ చేయించుకుంటున్నాను. నాకు సహాయం చేసిన జగనన్నకు కృతజ్ఞతలు.

– మునగాల రాఘవరెడ్డి, కొండారెడ్డి కొట్టాలు, పుల్లలచెరువు మండలం

క్లుప్తంగా

గిద్దలూరులో కార్డన్ సెర్చ్



కాలనీవాసులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

గిద్దలూరు రూరల్ : పట్టణంలోని అర్బన్ కాలనీలో ఆదివారం ఉదయం సీఐ దేవప్రభాకర్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. అక్రమ మద్యం, గంజాయి, ఇతర నిషేధిత వస్తువుల నిల్వలు నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు సీఐ తెలిపారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి సరైన ధృవపత్రాలు లేని 16 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో కంభం సీఐ ఎం రాజేష్‌కుమార్, ఎస్సైలు మహేష్, సుబ్బరాజు, కృష్ణ, పావని, నరసింహారావు, నాగమల్లేశ్వరరావు, పులిరాజేష్, అజితారావు, 40 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు పంటను పరిశీలించిన బోర్డు ఈడీ



రైతులతో మాట్లాడుతున్న ఈడీ శ్రీధర్‌బాబు

ఒంగోలు సెంట్రల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పొగాకు పంట పొలాలను పొగాకు బోర్డు గుంటూరు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు ఆదివారం పరిశీలించారు. ఒంగోలు-2, టంగుటూరు పొగాకు వేలం కేంద్రం పరిధిలోని త్రోవగుంట, మద్దిరాలపాడు, చేకూరపాడు, తుమాడు, కె.ఉప్పలపాడు గ్రామాల్లో దెబ్బతిన్న పొగాకు పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తుఫాన్‌కు దెబ్బతిన్న పొలాల వివరాలను రైతుల వారీగా సేకరించి నివేదిక పంపాలని బోర్డు ఆర్‌ఎం లక్ష్మణరావుకు సూచించారు. అన్ని నివేదికలు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు బోర్డు ఏఎస్ రామాంజనేయులు, ఒంగోలు ఏఎస్‌లు కె.రామకృష్ణ, శ్రీనివాసరావు, బోర్డు మెంబర్లు పి.వరప్రసాద్, బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సేవలు అభినందనీయం

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ
- ఘనంగా తపాలా ఉద్యోగుల సంఘ 40వ రాష్ట్ర మహాసభలు

మార్కాపురం: పోస్టల్ ఉద్యోగుల సేవలు అభినందనీయమని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కొనియాడారు. మార్కాపురం పట్టణంలోని మాధవీ గ్రాండ్ ఇన్‌లో ఆదివారం నిర్వహించిన అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘ గ్రూప్ సీ 40వ రాష్ట్ర మహాసభల్లో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి పోస్టల్ సేవలు ప్రజలకు అందుతున్నాయని, కాలానుగుణంగా వస్తున్న మార్పులను పోస్టల్ శాఖ కూడా అన్వయించుకుని ప్రజలకు సేవలందించడం అభినందనీయమని అన్నారు. ఎండా, వాన లెక్క చేయకుండా పోస్టల్ ఉద్యోగులు ప్రతిరోజూ దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు సేవలందిస్తున్నారని, వారి సేవలను ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని అన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వేదికపై ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, తదితరులు

మాట్లాడుతూ ప్రజాసేవలో పోస్టల్ ఉద్యోగులు వెలకట్టలేని సేవలు అందిస్తున్నారన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ ముందుంటుందన్నారు. ప్రజలకు సేవలందించేందుకు వివిధ రకాల ప్రైవేటు సంస్థలు వచ్చినప్పటికీ పోస్టల్ ఆదరణ ఏమాత్రం తగ్గలేదని మార్కాపురం పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలకు దగ్గరయ్యేందుకు తమ సిబ్బంది ముందుటున్నారని తెలిపారు. అనేక రకాల పథకాలు అందిస్తున్నారన్నారు. మార్కాపురం ప్రధాన తపాలా కార్యాలయ పోస్టుమాస్టర్ సయ్యద్ సుభానీ, ఉద్యోగుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ పోస్టల్ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రజల సంక్షేమం కోసం అనేక ఇన్సూరెన్స్ పథకాలు, డిపాజిట్ల పథకాలు ఉన్నాయన్నారు. వాటి గురించి ప్రజలకు ఉద్యోగులు వివరించాలని కోరారు. తొలుత పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, మార్కాపురం శాఖ కార్యదర్శి అర్షద్‌ఖాన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డీకే రఫీ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్టాండ్లలోని ఖాళీ స్థలాలు లీజుకు

ఒంగోలు: జిల్లాలోని ఐదు బస్టాండ్లలో ఖాళీగా ఉన్న స్థలాలను 15 సంవత్సరాలకు లీజుకు ఇచ్చేందుకు బిడ్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి బి.సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, 22వ తేదీ మధ్యాహ్నం 10.30 నుంచి 2 గంటల్లోపు నెల్లూరు జోన్-3 ఈడీ కార్యాలయంలోని టెండర్ బాక్సులో బిడ్ వేయాలని సూచించారు. అదేరోజు సాయంత్రం 3 గంటలకు టెండరుదారుల సమక్షంలోనే బిడ్లు తెరవడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఐదు ప్రదేశాల్లో ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ప్రతిపాదించడం జరిగిందన్నారు. వాటిలో ఒంగోలు గ్యారేజీలో (ఆర్టీసీ ఆస్పత్రి ఎదురుగా) ఉన్న 1978 చదరపు గజాలు, పామూరు బస్టాండు (బిట్-2)లో 2,565 చదరపు గజాలు, కొండపిలో 8225 చదరపు గజాలు, సింగరాయకొండ (బిట్-4)లో 300 చదరపు గజాలు, గిద్దలూరు గ్యారేజీ వెనుక 13262 చదరపు గజాలు ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారికి పూర్తి వివరాలు తెలియజేసేందుకు ఈ నెల 14న ఒంగోలు ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని ప్రజారవాణా అధికారి కార్యాలయంలో ముందస్తు అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెండరుదారులు ప్రతి పేజీలో సంతకం చేయాలని, పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో టెండర్ విభాగంలో పరిశీలించుకోవాలని సూచించారు.

నేటి నుంచి గ్రానైట్ భద్రతా వారోత్సవాలు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న గ్రానైట్ క్వారీల యజమానులు, ఏజెంట్లు

- ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని గ్రానైట్ క్వారీల్లో..

చీమకుర్తి: గ్రానైట్ భద్రతా వారోత్సవాలను ఈ నెల 11 నుంచి 16 వరకు నిర్వహించనున్నట్లు భద్రతా వారోత్సవాల కమిటీ ఆదివారం వెల్లడించింది. రామతీర్థంలోని వీటీసీ కేంద్రంలో వారోత్సవాల కమిటీ సభ్యులు చలువాది బదరీనారాయణ, రవిచంద్రన్, పవన్‌కుమార్, సుభాస్కర్‌రెడ్డి, వెంకట లోకేష్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వారోత్సవాలలో నిర్వహించే భద్రతా ప్రమాణాల గురించి వివరించారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని అన్ని గ్రానైట్ క్వారీలలో 21వ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైన్స్ అండ్ సేఫ్టీ డిప్యూటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. రామతీర్థంలోని యాపిల్ గ్రానైట్ క్వారీ యాజమాన్యం ఆతిథ్యంలో వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గ్రానైట్ క్వారీల్లో కార్మికులు ఉపయోగించే భారీ వాహనాలైన క్రేన్‌లు, డంపర్‌లు, ఇతర వాహనాలను వినియోగించటంలో కార్మికుల వృత్తి నైపుణ్యాలతో పాటు కార్మికుల రక్షణ, భద్రతా విధానాలు, క్వారీ యాజమాన్యం కల్పిస్తున్న రక్షణ ఏర్పాట్లపై భద్రతా కమిటీ పర్యవేక్షణ చేస్తారన్నారు. వారోత్సవాల్లో ప్రమాణాలను పాటించిన క్వారీలకు పాయింట్లు కేటాయించి నైపుణ్యతను కల్పించిన క్వారీలు, కార్మికులకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. 24వ తేదీ వారోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

ఖైదీలకు కూడా హక్కులుంటాయి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి
- జిల్లా జైలులో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

ఒంగోలు సబర్బన్: శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు, పలు కేసుల్లో నిందితులుగా ఉండి రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు కూడా హక్కులు, బాధ్యతలు ఉంటాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ భారతి తెలిపారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు నగరంలోని జిల్లా జైలులో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి మాట్లాడుతూ సామాన్య ప్రజానీకంతో పాటు ఖైదీలు, నిందితులకు కూడా హక్కులు, బాధ్యతలు ఉంటాయన్నారు. ఇబ్బందులు తలెత్తినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకుని సర్దుబాటు చేసుకుంటే చాలా వరకు సమస్యలు తగ్గుతాయని సూచించారు. తద్వారా నేరాలు తగ్గుముఖం పడతాయని హితబోధ చేశారు. హక్కులు కోరుకునే వారు బాధ్యతలను కూడా విస్మరించకూడదన్నారు. తప్పు చేసిన వారు తమ తప్పు తెలుసుకుని పరివర్తనతో బయటకు వెళ్లి మంచి పౌరులుగా సమాజ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. మంచి ప్రవర్తన అలవాటు చేసుకోవడానికి, చెడుదారి పట్టిన వారు మార్పునకు చదువే ఆధారమన్నారు. జైలు అధికారులు కల్పించిన విద్యా సౌకర్యాల ద్వారా ఖైదీలు విద్యనభ్యసించాలని పిలుపునిచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే శ్యాంబాబు మాట్లాడుతూ న్యాయ సహాయం కోరుకున్న ఖైదీలకు ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా సహాయం అందిస్తామని తెలిపారు. అందుకోసం జిల్లా కేంద్ర న్యాయసేవాధికార సంస్థకు సమాచారం అందించవచ్చన్నారు. నిరుపేద ఖైదీలకు ఎలాంటి రుసుం లేకుండా న్యాయ సహాయం అందించడానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ముగ్గురు న్యాయ కోవిదులను నియమించడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో జైలర్ వి.రమేష్, కారాగార వైద్యాధికారి కేఎస్‌వీఎస్ బ్రహ్మతేజ, డిప్యూటీ జైలర్ బి.శ్రీనివాసరావు, జైలు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి, పక్కన సీనియర్ న్యాయమూర్తి శ్యాంబాబు

గొర్రెల బీమా పథకాన్ని పునరుద్ధరించాలి

ఒంగోలు టౌన్: రాష్ట్రంలోని పశువులు ప్రతిరోజూ అనేక రకాల జబ్బులు, ప్రమాదాల వలన చనిపోతున్నాయని, పశుపోషకుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గొర్రెల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గంటా శ్రీరాం డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేసి పెంపకందార్లను ఆదుకోవాలని కోరారు. స్థానిక ఎల్బీజీ భవన్‌లో ఆదివారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. కండే బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీరాం ప్రసంగిస్తూ.. గొర్రెల బీమా పథకాన్ని పునరుద్ధరించాలని, గొర్రెల ఖరీదును పది వేల రూపాయలకు పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు ప్రసంగిస్తూ గొర్రెల పెంపకందార్లను ప్రోత్సహించాలని కోరారు. అందుకు తగిన నిధులు కేటాయించి గొర్రెల పెంపకాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో బొడ్డు రామరాజు, గుమ్మా బాలనాగయ్య, బి.శివయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, రావెళ్ల వెంకటరావు, కోనంకి ఆంజనేయులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న గంటా శ్రీరామ్, పక్కన తిరుపతయ్య

గిరిజనుల పథకాలపై పార్లమెంట్‌లో ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: గిరిజన తెగల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం అమలుచేస్తున్న కళ్యాణ్ యోజన పథకం కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలు, వాటి ప్రస్తుత స్థితి గురించి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తాజాగా జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నించారు. దానికి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయక మంత్రి రేణుకసింగ్ సరుత సమాధానమిచ్చారు. దేశంలో గిరిజన తెగలు, ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రధానంగా విద్య, జీవనోపాధి కల్పనకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ అమలుచేస్తున్న కల్యాణ్ యోజన పథకం కింద పలు పథకాలు ఉన్నాయన్నారు. ఈ పథకాన్ని కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యంతో 2021-22 నుంచి 2025-26 వరకు అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకంలో 5 భాగాలు ఉన్నట్లు వివరించారు. ప్రధానమంత్రి ఆది ఆదర్శ్ గ్రామ్ యోజన భాగం కింద 8 గిరిజన అభివృద్ధి రంగాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు రాలేదన్నారు. 2022-23లో గిరిజన సమూహాల అభివృద్ధి భాగం కింద రూ.16.45 కోట్లు, గిరిజన పరిశోధనా సంస్థల మద్దతు భాగం కింద రూ.2.19 కోట్లు, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ (పదో తరగతి లోపు)- రూ.37.93 కోట్లు, పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లు (పదో తరగతి పై తరగతులు) రూ.64.14 కోట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విడుదల చేసినట్లు కేంద్రమంత్రి రేణుకసింగ్ సరుత వివరించారు.

మహిళలు అభ్యున్నతి సాధించాలి

- భారతీయం సత్యవాణి పిలుపు
- ఘనంగా నారీ శక్తి సమ్మేళనం

ఒంగోలు సెంట్రల్: మహిళలు శక్తియుక్తులను, సామాజిక బాధ్యతను మరింత పెంచుకుని అభ్యున్నతి సాధించాలని భారతీయం సత్యవాణి పిలుపునిచ్చారు. జిల్లా నారీ శక్తి సమ్మేళనాన్ని ఆదివారం ఒంగోలులోని విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యవాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారని తెలిపారు. రాష్ట్రపతి వద్ద నుంచి శాస్త్రరంగం, కార్పొరేట్ కంపెనీలతో పాటు అన్ని రంగాలను శాసిస్తున్నారని చెప్పారు. స్త్రీ పరాక్రమవంతురాలు, శక్తివంతురాలు అని వివరించారు. న్యాయవాది శ్రీమతి విజయభారతి మాట్లాడుతూ మహిళలు తమని తాము అభివృద్ధి చేసుకుంటూ కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని అభివృద్ధి చేయడంలో భాగస్వామ్యం వహించాలని కోరారు. నారీశక్తి రాష్ట్ర కో ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జి సాధినేని యామిని మాట్లాడుతూ సమాజంలో పిల్లలను సంస్కారవంతంగా పెంచడంలో తల్లి పాత్ర గురించి వివరించారు. దేవాలయాలు, వృద్ధాశ్రమాలను నడపటం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను మహిళలు, యువత అందిపుచ్చుకుని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని కోరారు. సమాజ, దేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పలువురు మహిళలు సమాజంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు కారణం ఎవరన్న విషయంపై, ఉపాధి విషయాలపై చర్చించారు. సమావేశంలో 1300 మంది మహిళలు పాల్గొన్నారు. జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి, నారీశక్తి అమ్మాజి, పద్మావతి, స్థానిక బృందాలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారతీయం సత్యవాణి

వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే పుస్తక పఠనం

ఒంగోలు టౌన్: మన శరీరం ఆరోగ్యంగా ఉండేందుకు వ్యాయామం చేయడం ఎంత అవసరమో మెదడు సక్రమంగా పనిచేయడానికి పుస్తక పఠనం అంత అవసరమని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య అన్నారు. జిల్లా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలతో మర్యాద రామన్న, రాబిన్ హుడ్ కథలను చదివించారు. పొడుపు కథలు అడిగి సమాధానాలను రాబట్టారు. జీవితంలో ఏదైనా సాధించాలనుకున్న వారికి పుస్తకాలు చదవడం ఉపకరిస్తుందని ఉప గ్రంథాలయ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి చెప్పారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థినీ విద్యార్థులకు గ్రూప్-1, గ్రూప్-3 పరీక్షలపై మార్కాపురానికి చెందిన భానోదయ స్టడీ సర్కిల్ నిర్వాహకులు అవగాహనా తరగతి నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె.సంపూర్ణమ్మ, యం.శ్రీనివాసులు, ఎస్.అనిల్ బాబు, టి.గోవిందమ్మ పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న పేరయ్య

ఉపాధ్యాయుడు శ్రీనివాసప్రసాద్ అరెస్ట్

- కోర్టుకు తరలింపు, ఈ నెల 22వ తేదీ వరకు రిమాండ్

పెద్దదోర్నాల: బాలికలను నిర్బంధించిన కేసులో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కొమరోలు శ్రీనివాసప్రసాద్‌ను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై అంకమ్మరావు కథనం మేరకు... బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై నమోదైన కేసుకు సంబంధించి ఇన్‌చార్జి డీఎస్పీ టి.అశోక్‌వర్ధన్‌రెడ్డి విచారణ నిర్వహించారు. పూర్తి విచారణ అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి ఆదివారం ఉదయం గిద్దలూరు కోర్టు జడ్జి ముందు హాజరుపరిచారు. పోక్సో చట్టం కింద నమోదైన ఈ కేసులో నిందితుడికి ఈ నెల 22వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

అగ్రహారంలో జింక మృతి

చీమకుర్తి: చీమకుర్తికి కూతవేటు దూరంలో గల అగ్రహారంలోని ఆలయ సమీపంలో జింక మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చుట్టుపక్కల పొలాల నుంచి వచ్చిన జింక ఏమైందో ఏమోగానీ గత శుక్రవారం మృతి చెందింది. స్థానిక సర్పంచ్, వీఆర్‌ఓ, వలంటీర్ కలిసి స్థానిక అధికారుల ద్వారా ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కానీ, ఆదివారం రాత్రి వరకు కూడా ఫారెస్ట్ అధికారులు స్పందించకపోవడంతో సాక్షి దినపత్రిక దృష్టికి తీసుకొచ్చారు. జింక మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో రోడ్డు మీద రాకపోకలు సాగించే వారు చూసి వన్యప్రాణి చనిపోతే ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని విమర్శిస్తున్నారు. దీనిపై ఫారెస్ట్ రేంజర్ నరసింహారావును వివరణ కోరగా, స్థానిక ఫారెస్ట్ గార్డ్ శబరిమలై వెళ్లారని, సోమవారం దగ్గరలో ఉన్న ఫారెస్ట్ సిబ్బందిని పంపించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



జింక కళేబరం

వ్యాయామ ఉపాధ్యాయులను శిక్షణకు పంపాలి

ఒంగోలు: వ్యాయామ ఉపాధ్యాయులను ఆడుదాం ఆంధ్ర శిక్షణకు హాజరయ్యేందుకు రిలీవ్ చేయాలని అన్ని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు ఆదేశించారు. 11వ తేదీ అన్ని మండలాల్లో మండల స్థాయిలో వలంటీర్లకు ఆడుదాం ఆంధ్రాపై శిక్షణ ఉన్నందున అందరూ వ్యాయామ ఉపాధ్యాయులు సంబంధిత మండల విద్యాశాఖాధికారుల వద్ద రిపోర్టు చేయాలని ఆదేశించారు.

కారు ఢీకొని 37 గొర్రెలు మృతి

- మరో 7 గొర్రెలకు తీవ్రగాయాలు
- సుమారు రూ.7 లక్షల నష్టం

కొత్తపట్నం : కారు ఢీకొట్టడంతో 37 గొర్రెలు మృతి చెందగా, మరో 7 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామానికి చెందిన కొల్లుబోయిన సోమయ్యకు 60 గొర్రెలున్నాయి. ప్రతిరోజూ పొలం తీసుకెళ్లి వాటిని మేపుకుని వస్తుంటాడు. రోజూ మాదిరిగానే ఆదివారం కూడా పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చే సమయంలో సాయంత్రం వేళ అల్లూరులోని చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రమాదం జరిగింది. కొత్తపట్నం నుంచి ఒంగోలు వైపు వస్తున్న కారు వేగంగా వచ్చి రోడ్డు పక్కన వెళ్తున్న గొర్రెల మందను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 37 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మరో 7 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. వాటి విలువ రూ,7 లక్షలు ఉంటుందని బాధితుడు సోమయ్య తెలిపాడు. విషయం తెలుసుకున్న ఎస్సై బి.సాంబశివరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కారులో 9 మంది యువకులు ఉన్నారని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.



సంఘటన స్థలంలో మృతి చెందిన గొర్రెలు

స్నేహం.. అపూర్వం

- ఉత్సాహంగా 1984-87 బ్యాచ్ డిగ్రీ విద్యార్థుల సమ్మేళనం

మార్కాపురం: ఇరవై తొమ్మిదేళ్ల క్రితం మార్కాపురంలోని ఎస్‌వీకేపీ కళాశాలలో వారంతా క్లాస్‌మేట్స్. అప్పట్లో డిగ్రీ పూర్తి కాగానే ఉన్నత చదువులు, ఉద్యోగాల వేటలో ఎవరికి వారు విడిపోయారు. మరలా 29 సంవత్సరాల తర్వాత ఆదివారం మార్కాపురం పట్టణంలోని 'విహారి గ్రాన్ ఇన్'లో కలుసుకున్నారు. 'ఏరా.. ఒరేయ్..' అంటూ అలనాటి విషయాలు గుర్తు చేసుకుని ఆత్మీయంగా గడిపారు. కుటుంబ సభ్యులు, పిల్లల చదువులు, పెళ్లిళ్లు.. క్షేమ సమాచారాల గురించి చర్చించుకుంటూ ఆరు గంటలపాటు ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థి బొంతల రామ్ ప్రకాశ్ వీరందరిని కలిపేందుకు ఐదు నెలలపాటు శ్రమించారు. అప్పటి విద్యార్థులు ప్రస్తుత వైఎస్సార్ సీపీ నాయకులులైన ఎస్.రామసుబ్బా రెడ్డి(తర్లుపాడు), మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్షావలి, మధిర రైల్వే స్టేషన్ మాస్టర్ కాశిరెడ్డి, అనంతపురం ట్రాఫిక్ ఎస్సై కొండయ్య, మరో 15 మంది ఉపాధ్యాయులు, న్యాయవాదులు ఉన్నారు.

తమకు చదువు చెప్పిన లెక్చరర్లు పి.వెంగన్న, ముస్తాఫాను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

తేలు కాటుతో యువకుడు మృతి

లింగసముద్రం: గేదెలు మేపేందుకు వెళ్లిన యువకుడు తేలు కాటుతో మృతి చెందాడు. ఈ సంఘటన లింగసముద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. లింగసముద్రం గ్రామానికి చెందిన గోగుల మహేంద్ర (9) స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో తన తండ్రి మల్లికార్జునతో కలిసి గేదెలు మేపేందుకు వెళ్లాడు. ఊరి చివర గేదెలు మేపుకుంటుండగా దగ్గరలో ఉన్న ఇంటి ప్రహరీపై కండువా ఉండడంతో మహేంద్ర ఆ కండువాను తలమీద వేసుకున్నాడు. కండువాలో ఉన్న తేలు మహేంద్ర తలకి కుట్టడంతో కేకలు వేశాడు. దగ్గరలో ఉన్న తండ్రి వచ్చి కండువాను పరిశీలించగా అందులో తేలు కనిపించింది. వెంటనే 108లో కందుకూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా ఆదివారం మధ్యాహ్నం మహేంద్ర మృతి చెందాడు. తేలు కాటుకు మహేంద్ర మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ విజేత.. బాపట్ల

మార్టూరు: రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ విజేతగా బాపట్ల జిల్లా నిలిచింది. గత రెండు రోజులుగా మార్టూరు వివేకానంద నెక్స్‌జెన్ పాఠశాలలో నిర్వహిస్తున్న 42వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. అండర్-19 బాలబాలికల విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 18 జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో బాపట్ల, గుంటూరు, నెల్లూరు జిల్లాల క్రీడాకారులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందారు. బాలికల విభాగంలో గుంటూరు, శ్రీకాకుళం, అనకాపల్లి జట్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షూటింగ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివేకానంద పాఠశాల డైరెక్టర్ వేలూరు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.